


1 నుంచి ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్
డాక్టర్ బికె బసు 112వ జయంతిని పురస్కరించుకొని మార్చి 1 నుంచి 10వ తేదీ వరకు పది రోజులు పాటు ఆక్యుపంక్చరు ఉచిత వైద్యశిబిరాన్ని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు ప్రధానకార్యదర్శి మల్లారపు నాగార్జున బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక నొప్పులు, ఇతర సమస్యలు ఉన్నవారు తమను సంప్రదించ వచ్చని ఆయన తెలిపారు. తిరుపతి నగర ప్రముఖ ఆక్యుపంక్చర్ వైద్యులు డాక్టర్ ఎంఎస్.బాలాజీ పర్యవేక్షణలో ఈ శిబిరం జరుగుతుందని వివరించారు. రిజిస్ట్రేషన్‌కు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు. 90000 28195, 93980 00686.

కమిషనర్ వచ్చినా కదలని ఫైళ్లు..!

- దొంగ ఓట్ల వ్యవహారంలో అధికారులు భయం.. భయం..
- పెండింగ్‌లో అభివృద్ధి పనులు
- కార్పొరేషన్ చుట్టూ ప్రదక్షణలు చేస్తున్న ప్రజలు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్
తిరుపతి పార్లమెంట్ ఉపఎన్నికల్లో అప్పటి కమిషనర్‌గా పనిచేసి ప్రస్తుతం అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా ఉన్న గిరిషాను కేంద్ర ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. అలాగే తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ ఏఆర్‌ఓగా పనిచేసిన చంద్రమౌళీశ్వర రెడ్డిని రాష్ట్ర ఎన్నికల సంఘం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.. దీంతో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అధికారులపై తీవ్ర ప్రభావం పడింది. మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా అదితి సింగ్ బాధ్యతలు తీసుకున్న తర్వాత అప్రమత్తమయ్యారు. తిరుపతి కమిషనర్‌గా అదితి సింగ్ వచ్చినప్పటి నుంచి మున్సిపల్ కార్పొరేషన్ పాలన సక్రమంగా సాగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి..

నూతన కమిషనర్ అదితి సింగ్ అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి లోటుపాట్లు తెలుసుకోవల్సి ఉందని... ఇటు రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ సంక్షేమ పథకాలు అమలు వంటి పలు విభాగాలతో సమీక్షలు నిర్వహించాల్సి ఉంది. దీంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్షించి పరిశీలించాల్సి ఉంది. అయితే కమిషనర్ ఇవేమీ చూడడం లేదని, అసలు సమీక్షా సమావేశాలు కూడా నిర్వహించడం లేదని, కేవలం ఎన్నికలకు సంబంధించిన విధులు మాత్రమే నిర్వహిస్తున్నారని నగరంలో ప్రచారం జరుగుతోంది.

గత నెల 28వ తేదీన కమిషనర్ హరిత బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో అదిత సింగ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తిరుపతిలో రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా అన్ని డివిజన్లు పర్యటించి ఆ డివిజన్లో ఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకొని వాటికి సంబంధించిన పనులు చేయాల్సి ఉంటుంది. అలాంటి పనులు కూడా నగరపాలక సంస్థలు జరగడం లేదని మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులు గుసగుసలాడుతున్నారు. నగరంలో ప్రతిరోజు తడి, పొడి చెత్త సేకరించడానికి మినీ ఆటోలు, ట్రాక్టర్లు, కంటైనర్లు వినియోగిస్తారు. దానికి సంబంధించిన డీజిల్ బిల్లులు కూడా సకాలంలో కమిషనర్ చెల్లించడానికి అతి కష్టం మీద సంతకం చేసినట్టు సమాచారం. మిగిలిన ఇంజనీరింగ్ విభాగంలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులు, రెవెన్యూ విభాగంలో ఉన్న పెండింగ్ ఫైలు టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఉన్న పెండింగ్ ఫైల్లను ఇంతవరకు కొత్త కమిషనర్ పరిశీలించకపోవడం వల్ల ఇటు రాజకీయనేతలు అటు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతోపాటు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు కూడా రెండునెలల నుంచి ఇవ్వకపోవడం వల్ల కాంట్రాక్ట్ కార్మికులు అవస్థలు పడుతున్నారు.

పేరుకుపోతున్న ఫైళ్లు....

నగరపాలక సంస్థలు ఆయా విభాగాలు చెందిన ఫైళు బీరువాలో పేరుకుపోతున్నాయి. నూతనంగా కమిషనర్ బాధ్యతలు తీసుకున్న అదిత సింగ్ వాటిని క్లియర్ చేయడానికి సాహసించడం లేదని తెలుస్తోంది. నగరంలో కొత్తగా నిర్మించుకున్న ఇళ్లకు కొత్తగా ఆస్తి పన్ను విధించాలన్న రెవెన్యూ విభాగానికి ఫైళ్లు వెళ్లాలి అక్కడి నుంచి డిప్యూటీ కమిషనర్ తర్వాత కమిషనర్ లాగిన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. ఇలాంటి ఫైళ్లు 50 డివిజన్లకు సంబంధించి పేరుకుపోయి ఉన్నట్టు సమాచారం. దీంతోపాటు ఆస్తి పన్నులు, పేరు మార్పులు, చేర్పులతో పాటు ఇతర అంశాలకు సంబంధించిన ఫైలు పెండింగ్లోనే ఉండడంతో ప్రజలు ప్రతిరోజు మున్సిపల్ కార్పొరేషన్ తిరుగుతూనే ఉన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో కూడా అనేక ఫైల్స్ పేరుకుపోయి ఉన్నాయి. నగరంలో కాంట్రాక్టర్లు చేసిన అభివృద్ధి పనులకు సగం వరకు బిల్లులు రాకపోక మిగిలిన పనులు పూర్తి చేయడానికి కమిషనర్ నుంచి అనుమతులు ఇవ్వాల్సి ఉంది. అలాంటి పనులు కూడా పెండింగ్లో ఉన్నట్లు తెలుస్తుంది. నగరంలో వేసవికాలం మొదలుకాకముందే తాగునీటి సమస్య రాకుండా అత్యవసర ప్రాంతాల్లో నీటితసరఫరా చేసేందుకు కమిషనర్ నిధులు విడుదల చేయాల్సి ఉంది, అలాంటి అంశాలు కూడా కమిషనర్ పరిశీలించలేదని తెలుస్తుంది. టౌన్‌ప్లానింగ్ విభాగంలో నగరంలో కొత్తగా నిర్మించుకున్న ఇళ్లకు అనుమతులు కమిషనర్ లాగిన్ నుంచే రావాల్సి ఉంటుంది.. అయితే ఇలాంటి ఫైలు కూడా పెండింగ్లో ఉన్నట్టు సమాచారం. దీంతో పాటు మాస్టర్ ప్లాన్ రోడ్లు వేసిన చోట టిడిఆర్ బాండ్లు ఇవ్వాల్సిన వారికి చాలా వరకు పెండింగ్లో ఉండడం వల్ల స్థలాలు కోల్పోయిన వారు ప్రతిరోజు కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.


ఎన్నికల విధులు నిర్వహణ...

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో పాటు అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు కొత్తవారు కావడం వల్ల అభివృద్ధి పనులు కాకుండా కేవలం ఎన్నికల నిర్వహణ సంబంధించిన విధులు నిర్వహిస్తున్నట్లు నగరంలో ప్రచారం జరుగుతుంది. 50 డివిజన్లో సంబంధించిన కార్పొరేటర్లు తమ డివిజన్లో ప్రతి సోమవారం స్పందన గ్రీవెన్స్‌లో సమస్యలు తెలియజేస్తున్నా ఆ సమస్యలు పరిష్కారం కావడం లేదని కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చేనెల మూడో వారంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో డివిజన్లో పనులు జరగవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కమిషనర్ అభివృద్ధి పనులు సంబంధించి యుద్ధప్రాతిపదికంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుప్పంలో చంద్రబాబు హవాను

వైసీపీ బద్దలు కొడుతుందా..?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో :
ఇక్కడ నుంచి చంద్రబాబుపై ఎవరు పోటీ చేస్తున్నారు..?, ఎవరు గెలుస్తారనే చర్చలు.. గత మూడు దశాబ్దాలుగా స్థానికంగా కూడా జరిగేవి కావు.. దీనికి కారణం చంద్రబాబు కుప్పంలో పెంచుకున్న ఓటర్లు, నేతల నెట్‌వర్క్, ఏడాదికోసారి మాత్రమే నియోజకవర్గానికి వెళ్లే చంద్రబాబును మూడున్నర దశాబ్దాలుగా గెలిపిస్తున్న కుప్పం సీటు చరిత్ర ఓ సారి చూద్దాం...


చంద్రబాబు నాయుడు


ఎమ్మెల్సీ భరత్

చిత్తూరు లోక్‌సభ పరిధిలోకి వచ్చే ఏడు అసెంబ్లీ సీట్లలో కుప్పం నియోజకవర్గం ఒకటి. గతంలో చిత్తూరు లోక్‌సభ సీటును వరుసగా టీడీపీ గెల్చుకోవడంలో కీలకమైన మెజార్టీ అందించిన నియోజకవర్గం కూడా... జనరల్ సీటు అయిన కుప్పంలో మొత్తం 2.15 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గం పరిధిలో కుప్పం, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాలు ఉన్నాయి. జనాభా పరంగా చూస్తే వన్యకుల క్షత్రియులు ఎక్కువగా ఉన్నారు. ఆ తర్వాత మాల, కురవ, గాండ్ల కులస్తులు ఎక్కువగా ఉంటారు.

కుప్పంలో అసెంబ్లీ ఎన్నికల చరిత్రను ఓ సారి గమనిస్తే.. ఇక్కడ టీడీపీ ఆవిర్భావానికి ముందు ఐదు ఎన్నికలు జరిగాయి. ఇందులో 1962లో కమ్యూనిస్టు పార్టీ, 1967, 1972 ఎన్నికల్లో ఇండిపెండెంట్లు, 1955, 1978లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. 1983లో టీడీపీ ఆవిర్భావం తర్వాత నుంచీ ఇక్కడ ఆ పార్టీదే హవా. టీడీపీ ఆవిర్భావం తర్వాత కుప్పం అసెంబ్లీ సీటుకు మొత్తం 9 ఎన్నికలు జరిగితే ఇందులో అన్నీ టీడీపీయే గెలిచింది. 1983 నుంచి 2019 వరకూ ఇక్కడ టీడీపీయే గెలుస్తూ వస్తోంది. ఇందులో రెండుసార్లు 1983, 1985లో టీడీపీ అభ్యర్థి రంగస్వామి నాయుడు గెలిస్తే.. ఆ తర్వాత ఏడుసార్లు చంద్రబాబే గెలిచారు. చంద్రబాబును ఏడుసార్లు గెలిపించిన కుప్పంలో ఈసారి ఆ రికార్డును బ్రేక్ చేసేందుకు వైసీపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కుప్పంలో అభివృద్ధి కార్యక్రమాలు, కేజే భరత్‌ను అభ్యర్థిగా ప్రకటించి, గెలిస్తే మంత్రి పదవి ఇస్తామన్న హామీ, స్థానిక ఎన్నికల్లో గెలుపు వైసీపీని ఇక్కడ ఊరిస్తున్నాయి. అయితే కర్నాటక, తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న ఈ భిన్న పరిస్థితులు ఉన్న అసెంబ్లీ సీటులో చంద్రబాబును ఢీకొట్టి గెలవడం అంత సులువు కాదనేది ఇక్కడ వినిపిస్తున్న మాట.

3న తిరుపతిలో జీ తెలుగు

డ్రామా జూనియర్స్ సీజన్ 7 ఆడిషన్స్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:



ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ ముందుండే జీ తెలుగు మరోసారి తన సక్సెస్‌ఫుల్ షో డ్రామా జూనియర్స్ సరికొత్త సీజన్‌తో మీ ముందుకు వచ్చేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని పిల్లల్లోని నటనా ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో డ్రామా జూనియర్స్ సీజన్ 7 ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే విజయవంతంగా 6 సీజన్లను పూర్తి చేసుకున్న డ్రామా జూనియర్స్ మరో సీజన్‌తో తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. అంతేకాదు ప్రతిభగల పిల్లలని ఆడిషన్స్‌కు ఆహ్వానిస్తోంది. డ్రామా జూనియర్స్ సీజన్ 7 కోసం తెలుగు రాష్ట్రాల్లో నటనపై ఆసక్తిగల చిన్నారులకు అద్భుత అవకాశం అందిస్తోంది. 3 నుంచి 13 సంవత్సరాల వయస్సు గల పిల్లలు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు చక్కని అవకాశం అందిస్తోంది జీ తెలుగు. మీ పిల్లలకు నటనపై ఆసక్తి ఉంటే తప్పకుండా ప్రోత్సహించి వారి భవిష్యత్తుకు బాటలు వేయండి. విజయవంతంగా కొనసాగుతున్న జీ తెలుగు డ్రామా జూనియర్స్‌తో పాటు చక్కగా పాటలు పాడి అలరించే పిల్లలకోసం ఆన్లైండ్ ఆడిషన్స్ నిర్వహించనుంది. నటన, అద్భుతమైన డైలాగ్ డెలివరీ, మార్షల్ ఆర్ట్స్, మ్యాజిక్ లో ప్రవేశం ఉన్న పిల్లలకూ అద్భుత అవకాశం అందిస్తోంది. ఈ ఆడిషన్స్ ఆదివారం (మార్చి 3న) రోజు, హెరీటల్ పిఎల్ఆర్ గ్రాండ్, ఏపీఎస్ ఆర్టీసీసెంట్రల్ బస్టాండు వెనుక, తాతానగర్, తిరుపతిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు ఆడిషన్లు నిర్వహించబడతాయి. ఏవైనా సందేహాలు ఉంటే 91000 54301 నెంబర్‌కు కాల్ చేయవచ్చు.

జిల్లా సబ్ జూనియర్ బాక్సింగ్ టీం ఎంపిక



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా సబ్ జూనియర్స్ బాక్సింగ్ టీం ఎంపికను బుధవారం నిర్వహించారు. స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా డిఎస్‌డి ఓ సయ్యద్, గౌరవ అతిథులుగా తిరుపతి ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు వై.ప్రవీణ్, ప్రత్యేక ఆహ్వానితులుగా కార్యదర్శి శ్రీధర్, ఎం.హేమ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సయ్యద్ మాట్లాడుతూ బాక్సింగ్ క్రీడలో ప్రపంచ ఛాంపియన్ మైక్ టైసన్‌ని ఆదర్శంగా తీసుకొని, పట్టుదల, క్రమశిక్షణతో ఈ క్రీడలో రాణించాలని అన్నారు. వై.ప్రవీణ్ మాట్లాడుతూ వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే స్టేట్ చాంపియన్షిప్ లో పాల్గొనేందుకు తిరుపతి జిల్లా బాక్సింగ్ క్రీడాకారులని ఎంపిక జరిగిందని, వారు తప్పకుండా రాష్ట్ర బాక్సింగ్ ఛాంపియన్షిప్‌లో రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడాకారులు సెల్‌ఫోన్‌కి దూరమైతే క్రీడల్లోనూ, వారి చదువులోనూ రానిస్తారని సూచించారు. తిరుపతి జిల్లా కోచ్ కైలాష్ నూతనంగా ఎంపికైన టీంను ప్రకటించారు. నూతన జట్టు బాలురు ఆదర్శ కుమార్, దినేష్, సిసిందర్, వి. కార్తీక్, తేజ, జి. కార్తీక్, నిరంజన్. బాలికల జట్టు గంగా, జోష్ణ, హర్ష.

భాకరాపేట కానిస్టేబుల్ సస్పెండ్



ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పోలీస్‌స్టేషన్లో పనిచేస్తూ పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న కానిస్టేబుల్ వెంకట్రమణపై సస్పెండ్ వేటు పడింది. విధులపట్ల నిర్లక్ష్యం వహించడం, జవాబుదారీతనం లోపించడంతో పాటు అవినీతికి పాల్పడిన కానిస్టేబుల్ వెంకటరమణని సస్పెండ్ చేస్తూ బుధవారం తిరుపతి జిల్లా ఎస్పీ మలిక గర్గ్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో అవినీతికి తావు లేదని, అధికారులు, ఇతర సిబ్బంది బాధ్యతలు గుర్తుంచుకుని క్రమశిక్షణతో వ్యవహరించాలని ఎస్పీ హెచ్చరించారు.

భూ కబ్జాదారుడు సిద్ధుల రవిని అరెస్టు చేయాలి..!


- గుడిసెలు తొలగించిన ఎర్రగుట్టపైనే స్థలాలు చూపాలి
- సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి
- 15 రోజుల్లో పేదలకు న్యాయం చేస్తామని డిఆర్‌ఓ హామీ




డిఆర్‌ఓ కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న పేదలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: కరకంబాడీ వద్ద ఎర్రగుట్టపై పేదలేసుకున్న గుడిసెలను తొలగించినందుకు, అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసిస్తూ బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో వందలాది మందితో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం జరిగింది. దాదాపు 300 మంది పేదలు తమకు న్యాయం చేయాలంటూ ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా రోడ్డుపై కూర్చొని ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ ఏమి నేరం చేశారని పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చివేశారని, పేదల పక్షాన పోరాడుతున్న సిపిఎం నేతలను ఎందుకు అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. భూ కబ్జాదారుడైన సిద్ధులు రవి పైన పోలీసుల ప్రతాపం చూపించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం పట్టాలి ఇచ్చిన, నివాస స్థలాలు అనువైన ప్రాంతంలో చూపకపోవడంతో పేదలు గుడిసెలు వేయాల్సి వచ్చిందని అన్నారు. కబ్జాదారులు ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో జగనన్న పట్టాదారులకి స్థానికంగా స్థలాలు చూపించాలని కోరారు. పేదలకు స్థలాలు చూపేంతవరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిఆర్‌ఓ పెంచల కిషోర్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం డిఆర్‌ఓ మాట్లాడుతూ 15 రోజుల్లో పేదలకు స్థలాలు చూపిస్తామని హామీ ఇచ్చారు. సిపిఎం నాయకులు టి.సుబ్రమణ్యం, మాధవ్, జయచంద్ర, సాయిలక్ష్మి, వేణుగోపాల్, బుజ్జి, పార్థసారథి రెడ్డి, హరి, రాజశేఖర్, సెల్వరాజు, శివానందం, సత్య, ప్రకాష్, శీను సుజాతమ్మ, మమత, కుమారి, మునిరత్నం, బాదుల్లా, మోదీను, అమీదు పాల్గొన్నారు.

రైతన్నల ఖాతాల్లో రూ.3.93 కోట్లు జమ : జెసి


రైతు భరోసా నిధులను చెక్కు అందిస్తున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: 2023-24 సంవత్సరంకు గాను వైఎస్ఆర్ రైతు భరోసా, పిఎం కిసాన్ కింద వరుసగా ఐదో ఏడాది మూడవ విడత నగదు బదిలీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించి బటన్ నొక్కి నేరుగా బుధవారం అర్హులైన రైతుల ఖాతాల్లోకి జమ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో 1,80,763 మంది రైతులకు, కౌలు, ఆర్ఓఎఫ్ఆర్ సాగు రైతులకు రూ.36.29 కోట్ల లబ్ది, డాక్టర్ వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకం కింద రూ. 3.93 కోట్ల రూపాయల లబ్ది చేకూరిందని జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయగా తిరుపతి జెసి, వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖ, సెరికల్చర్ తదితర అనుబంధ శాఖల అధికారులు రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోనే 2019 నుండి 2022 వరకు 176345 రైతు కుటుంబాలకు 927 కోట్లు వారి ఖాతాల్లో నేరుగా జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం 2023-24 తిరుపతి జిల్లాలో మూడవ విడతలో సొంత భూమి కలిగిన రైతులు 178646 మందికి రూ.35.73 కోట్లు, ఆర్ఓఎఫ్ఆర్ 430 మంది రైతులకు రూ0.086 కోట్లు, కౌలు రైతులకు 1687 మందికి 0.47 కోట్లు వెరసి మొత్తం 1,80,763 మంది రైతులకు రూ.36.29 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. అలాగే డాక్టర్ వైఎస్ఆర్ సున్నావడ్డీ పంట రుణాలు పథకం రబీ 2021కు సంబంధించి 12,166 మంది లబ్దిదారులకు రూ.2.44కోట్లు, ఖరీఫ్ 2022కు సంబంధించి 6084 మంది లబ్ధిదారులకు రూ.1.49కోట్లు వెరసి మొత్తం 18,250 మంది లబ్ధిదారులకు 3.93 కోట్ల రూపాయల వడ్డీ రాయితీ నగదు లబ్ది చేకూరిందని తెలిపారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం రూ.36.29 కోట్ల మెగా చెక్కును, సున్నా వడ్డీ పంట రుణాలు పథకం కింద రూ.3.93 కోట్ల మెగా చెక్కును రైతులకు అందచేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి, జిల్లా సెరికల్చర్ అధికారిని గీతారాణి, వ్యసాయ సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

1న తిరుపతిలో కాంగ్రెస్ బహిరంగ సభ

బాబు, జగన్ బిజెపి భావజాలంలో కలిసిపోయారు..
ప్రత్యేకహోదా కాంగ్రెస్‌తోనే.. గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): ప్రధానమంత్రి అభ్యర్థిగా ఉండి శ్రీవారి పాదాల చెంత విభజన ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తానని చెప్పి మాట తప్పిన వ్యక్తి నరేంద్ర మోడీ అని సిడబ్ల్యూసి సభ్యులు గిడుగు రుద్దరాజు అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారమిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకొని వస్తానన్న జగన్, మరోవైపు చంద్రబాబు మోడీని దూషించి నేడు అధికారం కోసం వారితో పయనం అవుతున్నారంటే చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి ఇద్దరూ బిజెపి భావజాలంలో కలిసిపోయారని స్పష్టమవుతోందని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలు ఏర్పాటు చేసి రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని, అధికారం వస్తే కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసే గ్యారంటీ స్కీములను వివరిస్తూ వస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరుద్యోగుల ధర్నాలో పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి, నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. మార్చి 1న తిరుపతి వేదికగా కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభను నిర్వహించ తలపెట్టిందని, ఈ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్, ఏపీసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, ఇతర ప్రముఖులు ఈ బహిరంగ సభకు హాజరవుతారన్నారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి, భాస్కర్, ఏపీసీసీ ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, శ్రీరామమూర్తి, శంకర్, తిరుపతి పట్టణ అధ్యక్షులు యార్లపల్లి గోపి, పిసిసి కార్యదర్శి చిట్టిబాబు, లీలాశ్రీనివాస్, జావేద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

దళితులకు సాగు భూమి పట్టాలివ్వండి: సిపిఎం



ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కుక్కంబాకం గ్రామంలోని దళితులకు సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు, సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జి దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో బుచ్చినాయుడు కండ్రిగ తహాశీల్దార్ కార్యాలయం వద్ద కుక్కంబాకం దళితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ కుక్కంబాకం రెవెన్యూలో సర్వే నంబర్ 81లో ప్రభుత్వ భూమి 82ఎకరాల భూములను స్థానిక దళితులకు పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆ భూములకు సంబంధంలేని వ్యక్తి ఎల్లయ్య అనే పేరును ఉద్దేశపూర్వకంగా వెబ్లాండ్‌లో నమోదు చేసి స్థానికేతరులు, అగ్రకులాలు సదరు భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. తక్షణమే రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని వెబ్లాండ్‌లో నమోదైన ఉన్న ఎల్లయ్య అనే అజ్ఞాత వ్యక్తి పేరును తక్షణమే తొలగించి ప్రస్తుత సాగులో ఉన్న కుక్కంబాకం దళితులకు భూపట్టాల పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం లబ్ధిదారులపేర్లతో కూడిన జాబితాను తహాశీల్దార్‌కు అందజేశారు. స్పందించిన తహాశీల్దార్ మాట్లాడుతూ భూమిని పరిశీలించి వెబ్‌లాండ్‌లో పేరు ఉన్న వ్యక్తికి నోటీసులు పంపించి వివరణ తీసుకొని కలెక్టర్ కు రాసి పంపుతామని, తరువాత చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ నాయకులు రమేష్, నాగరాజు, మురళి, మండల నాయకులు రమణయ్య, ధనంజయలు, తిరుపాలు, మణి ఆచారి జెకె.రమణయ్య పాల్గొన్నారు.

1 నుంచి స్విమ్స్‌లో నగదు రహిత వైద్యసేవలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో గత మూడు దశాబ్దాలుగా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తూ పేద రోగులకు నాణ్యమైన వైద్యసేవలను అతి తక్కువ ఖర్చుతో అందిస్తోంది. అదే పంథాలో స్విమ్స్ అనుబంధమైన శ్రీ పద్మావతి జనరల్ హాస్పిటల్స్‌లో కూడా ఈ క్రింది విభాగాల ద్వారా నగదు రహిత వైద్య సేవలు 2024 మార్చి 1వ తేది నుంచి అందుబాటులోకి తెస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. గైనకాలజి అండ్ ఒబెస్ట్రిక్స్ (స్త్రీల వ్యాధులు, ప్రసూతి విభాగం) పీడియాట్రిక్స్ (చిన్న పిల్లల విభాగం), ఆప్తల్మాలజి (కంటి జబ్బుల విభాగం), ఇఎన్‌టి. (చెవి, ముక్కు, గొంతు విభాగాలు), జనరల్ మెడిసిన్ (సాధారణ జబ్బుల చికిత్స విభాగం), జనరల్ సర్జరీ (సాధారణ శస్త్రచికిత్స విభాగం) పై విభాగాల ద్వారా నార్మల్ డెలివరీ, సిజేరియన్ ఆపరేషన్లు, టాన్సిల్స్, కటారాక్ట్, హెర్నియా, అపెండిక్స్, మొలలు (ఫైల్స్), థైరాయిడ్, సాధారణ జబ్బులైనటువంటి జ్వరాలు, వాంతులు, విరోచనాలు మొదలైన వాటికి కూడా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య కార్డు వున్న వారికి పూర్తిగా నగదు రహిత సేవలు అందించబడుతాయని తెలిపారు.

'ఈవీఎంలను రద్దుచేయాలి'



ప్రజాశక్తి-గూడూరుటౌన్: ఈవీఎంలను రద్దు చేసి బ్యాలెట్ పేపర్‌తోనే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ భారత లౌకిక రాజ్యాంగ పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం పోస్ట్ కారుల ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక సభ్యులు పట్టణ ప్రజల నుండి పోస్ట్ కార్డులలో వివరాలను నమోదు చేశారు. ఈవీఎంలు వద్దు బ్యాలెట్ ఎన్నికలే ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఐక్యవేదిక సభ్యులు, సి.పి.ఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ ఈసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇకపై ఎన్నికలు కూడా ఉండవన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే బ్యాలెట్ ఓటింగ్ తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షులు బి.వి.రమణయ్య, పట్టణ కార్యదర్శి సురేష్, బి.చంద్రయ్య, నాయకులు ప్రభాకర్, శశికుమార్, షేక్ కాలేషా, సీవీఆర్ కూమార్, చంద్రయ్య, రియాజ్ అహ్మద్, అన్వర్ బాషా, గౌస్, షానవాజ్, సందాని తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయునికి ఘన సన్మానం




ప్రజాశక్తి-గూడూరుటౌన్: గూడూరు రూరల్ ప్రజాశక్తి దినపత్రికలో పనిచేయుచున్న సీనియర్ పాత్రికేయులు తిరుమల శెట్టి సుధాకర్ రావుకు "ఆశిక్ హోటల్" నందు బుధవారం ఘనంగా వారికి సన్మానం చేయడం జరిగింది. వృత్తి గత కారణాలు, వయోభారం దృష్ట్యా ఆయన ఇక నేను కొనసాగలేనని పత్రికా యాజమాన్యానికి తెలియజేయడంతో వెంటనే వారు స్పందించి గూడూరుకి వచ్చి ఆయనను పరామర్శించడం జరిగింది. ప్రజాశక్తి తిరుపతి యూనిట్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ తిరుమల శెట్టి సుధాకర్ రావు 2009లో పత్రికా రంగంలోకి రావడం జరిగిందని, ఆయన ఇప్పటివరకు సుమారు 15 సంవత్సరాలు విరామం లేకుండా ప్రజలలోకి వెళ్లి వారి బాధలు తెలుసుకొని, అధికారులు ద్వారా వారి సమస్యలు వెంటనే పరిష్కరించడం, సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి విషయాలలో ఆసక్తితో పనిచేయడం ప్రజల ప్రశంసలు పొందడం చెప్పుకోదగ్గ విషయమని ఆయన అభినందించారు. అనంతరం గూడూరు పట్టణ సి.పి.ఎం. శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సి.ఐ.టి.యు.పట్టణ అధ్యక్షులు బి.వి.రమణయ్య, కార్యదర్శి యస్.సురేష్ శాలువా కప్పి, పూలమాలవేసి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి స్టాఫర్ గోపి, డస్క్ ఇన్చార్జి వనజ , తిరుపతి ప్రజాశక్తి ఇన్చార్జి శ్రీనివాసులు, సర్కులేషన్ ఇంచార్జి సురేష్, గూడూరు డివిజన్ ఇన్చార్జి వెంకట్రావు, ప్రజాశక్తి గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, నియోజకవర్గ విలేకరులు అందరూ పాల్గొన్నారు జరిగింది.

ఐఎఫ్టీయు యూనియన్‌కు మూకుమ్మడి రాజీనామాలు

ప్రజాశక్తి తిరుపతి టౌన్

ఐఎఫ్టీయు నాయకత్వానికి యూనియన్ ప్రాథమిక సభ్యత్వానికి యూనియన్ నాయకులు గంగాదేవి, అరుణ, నాయకులు సుభాషిణి, మొబీనా, నాగరత్న, నిర్మల, సుజాత, పార్వతి రాజీనామాలు సమర్పించామని ప్రకటించారు. ఐఎఫ్టీయు యూనియన్ ప్రారంభం నుండి తిరుపతిలోనూ ఉమ్మడి చిత్తూరు జిల్లా మొత్తం తిరిగి కష్టపడి పనిచేసిన నాయకులకు గుర్తింపు లేకుండా పోయిందని యూనియన్ లో నియంతృత్వ పోకడలు ఎక్కువయ్యాయని చేసిన తీర్మానాలకు విలువ లేకుండా పోతుందని యూనియన్‌లో మనస్ఫూర్తిగా పనిచేయలేకపోతున్నామని అంగన్వాడి సమ్మె కాలంలో కూడా చాలా అవమానాలకు గురయ్యామని ఐఎఫ్టీయు నాయకత్వ స్థానాలకు మరియు యూనియన్ ప్రాథమిక సభ్యత్వాలకు సైతం మేమంతా రాజీనామాలు సమర్పిస్తున్నామని అందుకోసం ఐఎఫ్టీయుకు అనుబంధంగా ఉన్న ఉన్న అంగన్వాడి యూనియన్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు నాయకత్వ స్థానాలకు, యూనియన్ ప్రాథమిక సభ్యత్వాలకు సైతం మేము రాజీనామాలు సమర్పిస్తున్నామని వారు తెలియజేశారు

ఘనంగా జాతీయ సైన్స్ డే



క్యాంపస్‌లో


మంగళంలో


రేణిగుంటలో

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్ డే ని ఘనంగా నిర్వహించారు. భాకరాపేట గీతాంజలి స్కూల్, సాయిరాం స్కూల్, నారాయణ స్కూల్లో కరస్పాండెట్లు గిరికుమార్ రెడ్డి జనార్దన్‌రెడ్డి ,మోహన్‌లు విద్యార్థుల ప్రాజెక్టులు, స్టాల్స్‌ను ప్రదర్శించారు. గీతాంజలి స్కూల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిఐ మస్తాన్ వలి, ఎంఈఒ గోపినాద్, డాక్టర్ వేణుగోపాల్, సర్పంచ్ భూపాల్ చేతులు మీదుగా బహుమతులు అందజేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ: కనమనబెడు ప్రాథమిక పాఠశాలలో జాతీయ సైన్స్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నమూనా, ప్రదర్శించిన నాటకం ఆకట్టుకున్నాయి. జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు.

గూడూరుటౌన్: పట్టణంలోని సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జా య సైన్స్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నారాయణ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ రవి ప్రసాద్ పాల్గొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవ జెండాను ఆవిష్కరించి విద్యార్థులు ప్రదర్శించిన వర్కింగ్ మోడల్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. దాదాపుగా 220ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, పవన్, మల్లికార్జున, హరికృష్ణ, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: సైన్స్ మన జీవన శైలిని మారుస్తుందని డీఈవో శేఖర్ అన్నారు. బుధవారం కరకంబాడీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సైన్స్ డే ప్రదర్శనను ఆయన సందర్శించారు. కేశవరెడ్డి ఈఎం స్కూల్ మామండూరు నందు ఘనంగా "జాతీయ సైన్స్ దినోత్సవాన్ని" నిర్వహించడం జరిగింది. అదేవిధంగా అమరరాజా విద్యాలయంలో బుధవారం సైన్స్ డే దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

శ్రీకాళహస్తి: విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మక సాంకేతిక పరిజ్ఞాన్ని బయటకు తీసి భావి శాస్త్ర వేత్తలు కావాలని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జయరామారావు వీధిలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

తిరుపతి డెస్క్: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మొహిద్దీన్ బాషా అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం సివి రామన్ జయంతిని పురస్కరించుకొని సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ డే దినోత్సవం నిర్వహించారు.

తిరుపతి సిటీ: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని భాష్యం స్కూల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక న్యూ బాలాజీ కాలనీలోని భాష్యం బృహస్పతి క్యాంపస్లో జరిగిన కార్యక్రమానికి మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ మమత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లక్ష్మణ్ రావు, ప్రిన్సిపాల్ నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి టౌన్: ఎస్వీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని హెచ్ఎం జే.సంధ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. విశిష్ట అతిథిగా టీటీడీ డీఈవో డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి పిల్లలను ఉద్దేశించి డాక్టర్ సి.వి.రామన్ గొప్పతనం, నిజజీవితంలో సైన్స్ ప్రాధాన్యత, చంద్రయాన్-3 మొదలు అంశాలను గురించి పిల్లలకు చక్కటి సందేశాన్ని ఇచ్చారు.

పుత్తూరుటౌన్: విజ్ఞానశాస్త్రం మానవుల అభివృద్ధికి అనేక విధాలు తోడ్పడుతుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

తిరుపతి మంగళం: సైన్స్ డే సందర్భంగా మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీలో గల శ్రీనివాస హైస్కూల్లో విద్యార్థులు భావితరాలకు ఉపయోగపడే మంచి ఆవిష్కరణలను చేశారని తిరుపతి అర్బన్ ఎంఈఓ బాలాజీ అన్నారు. సైన్స్ డే పురస్కరించుకొని విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పరిశీలించారు. ఆవిష్కరణ ఆవశ్యకతను విద్యార్థులు ఎంఈఓకు చక్కగా వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాంపస్: జీవకోనలోని విశ్వం హైస్కూల్‌లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పాల్గొన్నారు. సీవీ రామన్ కనుగొన్న నూతన పరిశోధన "రామన్ ఎఫెక్ట్ " ఫలితాలు ఎంతో మంది సైన్స్ విద్యార్థులకు ఆదర్శమని విసి ఆచార్య శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని 'ఇండోజినస్ టెక్నాలజీస్ ఫర్ వికసిత భారత్' అనే అంశాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య వి.శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

కందారపు మురళికి యానాదయ్య క్షమాపణలు చెప్పాలి: రాధాదేవి


మాట్లాడుతున్న రాధాదేవి


ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కార్మికుల సమస్యలను అంకితభావంతో పరిష్కరించడానికి పోరాటం చేసే సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళిపై టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య అనుచితంగా మాట్లాడడం తగదని, వెంటనే యానాదయ్య కందారపు మురళికి బహిరంగ క్షమాపణ చెప్పాలని టిటిడి మహిళా క్షురకుల వ్యవస్థాపకులు, అధ్యక్షులు కె.రాధాదేవి డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న యానాదయ్య టిటిడి కళ్యాణ కట్టలో పెర్మనెంట్ పోస్టులు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు ఆయనపై ఉన్నాయన్నారు. ఎక్కడో హైదరాబాద్ నుండి వచ్చిన పుల్లయ్య భార్య దొంగ సర్టిఫికెట్తో ఉద్యోగం చేస్తున్న సాటి నాయి బ్రాహ్మణులే కదా అని సర్దుకుపోయామన్నారు. రూ.80లక్షల వసూలు చేశారని క్షురకులు శ్రీహరి, నాగేంద్రపై ఆరోపణలు చేశారని కానీ విజిలెన్స్ నివేదికలో ఎక్కడ వారు వసూలు చేసినట్టుగా నిర్ధారణ కాలేదన్నారు. ప్రసాద్ అనే క్షురకుడిని కూడా ఇలానే ఇబ్బందులు పెట్టిన అతనిపై ఏ ఆరోపణలు లేకపోయినా అతన్ని విధుల నుండి తొలగించారన్నారు. ఎన్నో పోరాటాల ఫలితంగా టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి నేతృత్వంలోని పాలకమండలి క్షురకులకు 20వేల వేతనం ఇవ్వడం, అలానే తొలగించిన తొమ్మిది మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించడం శుభ పరిణామన్నారు. అధికారులు వెంటనే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాటి నాయి బ్రాహ్మణులకు సేవ చేసే భాగ్యం కలిగిన యానాదయ్య మాత్రం వారి దగ్గరే దండుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని, వసూళ్ల లావాదేవీలు ఎవరు జరిపారు స్వచ్ఛందంగా వారే విచారణ కమిటీ వేసుకోవాలని సూచించారు.

మహిళా వర్సిటీలో కేకలతూరి కృష్ణయ్య ధర్మనిధి సదస్సు



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖ ఆధ్వర్యంలో కేకలతూరి కృష్ణయ్య ధర్మనిధి సదస్సు బుధవారం సెమినార్ హాల్ హ్యుమానిటీస్ బ్లాక్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విసి ఆచార్య దేపూరు భారతి మాట్లాడుతూ అసాధారణమైన కృషితో తనను తాను తీర్చిదిద్దుకున్న కేకలతూరి కృష్ణయ్య అని వారు పూర్తి చేసిన ప్రాజెక్టులు దేశం గర్వించదగ్గ అంశాలని, ఈ రచయిత ప్రకృతిలోని అందచందాలను, పర్యావరణ స్పృహ ఆధారంగా వారి రచనలలో ఎంతో వివరించారని, నేటి యువతకు మార్గదర్శం చేయాలని వారు కాంక్షించిన తీరును అభినందించారు. ఇన్‌ఛార్జ్ తెలుగు శాఖాధ్యక్షులు వై.సుభాషిణి, సదస్సు సంచాలకులు డా.డి.యువశ్రీ మాట్లాడుతూ కేకలతూరి కృష్ణయ్య రూ.5లక్షలు తెలుగుశాఖకు అందించారన్నారు. కేకలతూరి కృష్ణయ్య జననం గురించి, వారి జీవిత అంశాల గురించి తెలిపారు. వక్త డా.నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ ఆదిమానవుడు ప్రకృతిలో జన్మించాడని మనం తెలియకుండానే ఎంతో ధ్వంసం అయిపోతున్నామని కారణం ప్రకృతి పరంగా మానవుడే అని తెలిపారు. పరిశ్రమల వల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్న తీరును నవలాపరంగా విశ్లేషించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్హెచ్ఎం డీన్ ఆచార్య కె.అనూరాధ, ఆచార్య హరిపద్మరాణి, డా.నీరజ, డా.అనురాధ, డా.అనిత, డా.మల్లేశ్వరరావు, డా.లక్ష్మీప్రియ, డా.వి.కృష్ణవేణి, ఎన్.సుమలత, డా.కలవకుంట రామమూర్తి, కృష్ణస్వామిరాజు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఆటో టెండర్‌లు రద్దు చేయాలి: సిఐటియు


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పట్టణంలోని ఆటో వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో ఆటో టెండర్లు రద్దు చేయాలని ధర్నా నిర్వహించి కమిషనర్, మున్సిపల్ చైర్మన్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఎక్కాడా లేని విధానాన్ని ఇక్కడి మున్సిపల్ అధికారులు రుసూము వసూలు చేయడం సరైనది కాదని సూచించారు. ఇప్పటికైనా ప్రైవేటు బస్టాండు టెండర్‌లో ఆటోవాలాలకు మినహాయింపు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో వర్కర్స్ ఫైనాన్స్‌లు కట్టలేక, పోలీసు ఫైన్‌లు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మున్సిపల్ కమిషనర్ స్పందించి ఆటో టెండర్లను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు విజయ్, వెంకటేశు, యాసిన్ బాషా, రమేష్, రవి, హరిచంద్ర, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎంఎస్ఎం సర్వే

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ర్యాంప్ అనే నూతన పథకానికి సంబంధించిన ఎంఎస్ఎం సర్వేను మార్చి 1వ తేదీ నుంచి జిల్లాలో నిర్వహించనున్నట్లు ఏపిఎంఎస్ ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ సీఈవో తెలిపారు. ఈ సర్వేను మార్చి 20వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వార్డ్ అమినిటీ సెక్రటీలు సర్వే చెప్పాడుతారని, దీన్ని ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ప్రజలు దీనికి సహకరించాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: సాయిసుధా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుధారాణి తెలిపారు. స్థానిక తిలక్‌రోడ్డులోని ఆసుపత్రి వద్ద గురువారం ఉదయం 10గంటలకు క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

జగన్‌పై జనాలు విసిగిపోయారు: సుధారెడ్డి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: సీఎం వైఎస్ జగన్‌పై ప్రజలు విసిగిపోయారని టీడీపీ చంద్రగిరి ఇన్‌ఛార్జ్ పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చట్టేవారిపాళ్యం పంచాయతీలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆబోయేది టీడీపీ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బెల్లంకొండ మురళి, ఆర్‌వీ రమణరెడ్డి, నాగిరెడ్డి, మునస్వామినాయుడు, కుమారస్వామిరెడ్డి, ఖాదర్‌వల్లి, మున్నా, చలపతినాయుడు, మౌలాలి పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన పుత్తూరు నేతలు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: చెన్నై శ్రీపెరంబదూరు ఆలయ పర్యటనలో ఉన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ కలిశారు. ఆయనతో పాటు నాయకులు గోపినాథ్ తదితరులు ఉన్నారు.

45 రోజులు కష్టించి పనిచేస్తే గెలుపు తథ్యం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-గూడూరుటౌన్: 45రోజుల పాటు పార్టీ శ్రేణులు కష్టించి పనిచేస్తే గెలుపు తథ్యం అని వైసీపీ ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. బుధవారం పట్టణంలోని సనత్‌నగర్‌లో బూత్ కన్వీనర్‌లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీని మరోసారి గెలిపించుకోవడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో దేవసానమ్మ, కల్పలత, శ్రీనివాసులు, నాగులు, రాజారెడ్డి, గురవయ్య, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

బలిజల ఆత్మీయ సమావేశం

జయప్రదం చేద్దాం: ముద్రనారాయణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మార్చి 1న నిర్వహించ తలపెట్టిన బలిజల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, బలిజ జేఏసీ కన్వీనర్ నీలం బాలాజీ పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బలిజలను గుర్తించి అభివృద్ధి కోసం పాటుపడే వారికి ఐక్యంగా ఉండి మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు పొన్నాల చంద్ర, దూది కుమారి, టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు అనిల్ రాయల్, వెంకటేష్‌రాయల్, మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ చిన్నముని, శేఖర్‌రాయల్, దొరైరాజు, సురేష్ రాయల్, డిష్ చంద్ర, బాలిశెట్టి కిషోర్, తిరుమల బలిజ నేతలు బెల్లం రమేష్, సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

ప్రజాశక్తి-వరదయ్యపాళ్యం: మండల కేంద్రంలో బుధవారం టైలర్స్ డే సందర్భంగా 300మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సీనియర్ టైలర్ నాయకులు చిన్నిరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న టైలర్ల జీవితాలు మాత్రం మారడం లేదని నిరుపేద ప్రజలు బతుకుతెరువు కోసం టైలర్ వృత్తిని ఎంచుకొనీ బతుకుతున్నారన్నారు. ప్రభుత్వం వారిని గుర్తించి ఫెడరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీ రుణాలు అందించి గుర్తింపు కార్డులను అందించి అదేవిధంగా 50ఏళ్లు నిండిన టైలర్లకు పెన్షన్ స్కీమును అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోహన్, వెంకయ్య, చాన్‌బాషా, మహబూబాషా, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పట్టణంలో జాతీయ టైలర్స్ దినోత్సవాన్ని టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ పురవీధులలో ర్యాలీ చేపట్టారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ధరణి, బాబు పాల్గొన్నారు.

'ఇంటర్ పరీక్షలకు మౌలిక వసతులు కల్పించాలి'

ప్రజాశక్తి-క్యాంపస్: జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్ ఎగ్జామ్ సెంటర్లలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ తిరుపతి ఆర్ఐఒ ప్రభాకర్ రెడ్డికి బుధవారం వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, సాయి, పవన్, జాని తదితరులు పాల్గొన్నారు.

పసుపులేటి వసుధకు డాక్టరేట్



ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూ మనస్తత్వశాస్త్రం విభాగం పరిశోధక విద్యార్థిని పసుపులేటి వసుధకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలి పారు. మనస్తత్వ శాస్త్రవిభాగం ఆచార్యులు, ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య వి.శ్రీకాంత్ రెడ్డి మార్గదర్శకత్వములో "స్ట్రెస్, సోషల్ సపోర్ట్ అండ్ సైకలాజికల్ వెల్ బీయింగ్ అమాంగ్ ఎల్డర్లీ" అను అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. వసుధ పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్‌లలో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించారు. అనేక జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా సదస్సులలో పాల్గొని అనేక పరిశోధనా పత్రాలను సమర్పించినట్లు వివరించారు. పసుపులేటి వసుధకు డాక్టరేట్ డిగ్రీ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు పరిశోధకులు, బంధుమిత్రులు, శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలు అభివృద్ధివైపే నిలబడతారు: మోహిత్ రెడ్డి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సీఎం జగన్మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించారని, రానున్న ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధివైపే నిలబడతారని చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. బుధవారం మంగళం పరిధిలోని మంగళం, సప్తగిరి కాలనీ, రణధీరపురం గ్రామపంచాయతీలలో ఏపీకి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండాలను ఆయా పంచాయతీలలో ఆవిష్కరించారు. యువ నాయకుడు సతీష్(నాని) ఏర్పాటుచేసిన వైసిపి పార్టీ కార్యాలయాన్ని మోహిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసరా చెక్కులను మోహిత్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంగళం డివిజన్ వైసిపి అధ్యక్షులు ప్రళయకావేరి నారాయణరెడ్డి, హరికృష్ణ, శివశంకర్ రాజు, లక్ష్మీనారాయణ, అశోక్ కుమార్ రెడ్డి, రాంబాబు, బైరెడ్డి రమేష్, సుధాయాదవ్, ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయ నిర్మాణానికి తుడా చైర్మన్ చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బుధవారం శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ భవన నిర్మాణానికి ఆయన రూ.90 లక్షల నిధులు మంజూరు చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి, జెడ్పిటిసి యుగంధర్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాలు తొలగించిన వారిపై

కేసు వేస్తా: జెడ్పిటిసి మురళీధర్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజల కోరిక మేరకు జడ్పిటిసి సభ్యుడిగా అప్పలాయగుంటలో సచివాలయం, పాలసీతలేఖరణ కేంద్రం, ఆర్బికేలను తగిన ప్రోటోకాల్ ప్రకారం శిలాఫలకాలను అధికారులు అందిస్తే వాటిని ప్రారంభించానని, అయితే తాను ఆవిష్కరించిన శిలాఫలకాలను పంచాయతీరాజ్ అధికారులు పోలీసుల బందోబస్తు మధ్య ఎత్తుకెళ్లిపోయారని వడమాలపేట జడ్పిటిసి సభ్యుడు ఎం. మురళీధర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రజాధనంతో నిర్మించిన భవనాలకు తాను ముఖ్యఅతిథిగా వెళ్లి ఆవిష్కరించడం జీర్ణించుకోలేని మంత్రి రోజా అధికారులకు హుకుం జారీ చేసి శిలాఫలకాలను ఎత్తుకెళ్లేలా చేశారని ఆరోపించారు. ఎన్నికల వేళ ఇలాంటి చర్యలు ఎవరికి చెడు చేస్తాయో ఒకసారి ఆలోచించుకోవాలని మంత్రికి సూచించారు. సొంత పార్టీ నేతలపైనే ఈ విధంగా అక్కస్సు చూపిస్తూ అణిచివేతకు గురి చేయడం శోచనీయమని, మీడియా ద్వారా ముఖ్యమంత్రి ఇక్కడి పరిస్థితులను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శిలాఫలకాలు తీసుకెళ్లడంపై అక్కడి డిఎస్పికి ఫిర్యాదు చేస్తే ఆయన మీకు తెలియదా అని బదులిస్తున్నారని, దీనిపై పంచాయతీరాజ్ అధికారులపై ప్రైవేటు కేసు వేస్తున్నానని అన్నారు.

మా నాన్నకు ఒక్క అవకాశం ఇవ్వండి: వినీల్

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): నీతి, నిజాయితీ, నిబద్ధత గల నిస్వార్థ నాయకుడు పులివర్తి నాని అని అలాంటి వ్యక్తి పులివర్తి నానిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని టీడీపీ చంద్రగిరి ఇన్‌ఛార్జ్ పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ అన్నారు. బుధవారం చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి పంచాయితీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఓటర్లను అభ్యర్థించారు.

పోలింగ్ కేంద్రాల్లో

అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలి: తహశీల్దార్

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాటు పూర్తి చేయాలని తహశీల్దార్ అలీఖాన్ అన్నారు. బుధవారం బీఎల్‌వోలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీటీ చంద్రబాబు, సీనియర్ అసిస్టెంట్ నాగార్జునరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు కిరణ్, గురునాథ్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యావంతులు మచ్చలేని వారు: నాగేశ్వరరావు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నేడున్న రాజకీయ పార్టీల్లో ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసే వారు కరువుతున్నారని, ఉన్నత విద్యావంతులు సభ్యులుగా ఏర్పడిన పార్టీ నేషనల్ స్కాలర్స్ పార్టీ అని ఆ పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యుజిసి బడ్జెట్లో రూ.6900కోట్లలను కేటాయించకుండా నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుత గణాంకాల ప్రకారం నిరుద్యోగుల సంఖ్య రాష్ట్రంలో, దేశంలో కలిపి 12కోట్ల వరకు ఉందని ఐఎంఎఫ్ నివేదిక పేర్కొంటుందన్నారు. ఏడాదికి నాలుగున్నర లక్షల మంది విద్యావంతులుగా సమాజంలోకి అడుగుపెడుతున్న, కొద్దిపాటి ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో విఫలమవుతున్నాయన్నారు. ఉన్నత విద్యావంతులు మచ్చ లేని వారు మాత్రమే దేశాన్ని ఒడిదుడుకులతో ఉన్న ఆర్థిక పరిస్థితుల నుండి రాబడి ఆర్థిక పరిస్థితులకు తీసుకు రాగలరన్నారు. ఉన్నత విద్యకు ఎలాంటి ప్రామాణిక కేటాయింపులు గడిచిన ఏళ్లలో చంద్రబాబు గాని, ప్రస్తుతం ఉన్న జగన్మోహన్ రెడ్డి గాని చేయలేదన్నారు. విద్యావంతులు దేశ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేస్తూ నేషనల్ స్కాలర్స్ పార్టీకి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి మేనిఫెస్టోను వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ సభ్యులు విజయ్ కుమార్, శ్రీనివాసరావు, పార్టీ కోశాధికారి శ్రీవిద్య, వెంకట్ నాయక్ పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ అర్బన్ సీఐ సీహెచ్‌వి సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం పాత రేణిగుంట మార్గంలో మంగళవారం రాత్రి సోదాలు నిర్వహించామన్నారు. శ్రీనివాసపురంకు చెందిన బాలాజీ పుదుచ్చేరికి చెందిన మద్యాన్ని కలిగి ఉండడంతో అరెస్ట్ చేశామన్నారు. కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐ స్వామినాథన్, హెడ్ కానిస్టేబుళ్లు మనోహర్, సుధాకర్ రాజు, కానిస్టేబుళ్లు చిరంజీవి, వినోద్ పాల్గొన్నారు.

విలేకరి ఇంట్లో చోరీ

- బంగారం దోచుకెళ్లిన దొంగలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఓ వార్తా పత్రికలో పనిచేస్తున్న విలేకరి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి రాజీవ్ నగర్ సమీపంలోని జర్నలిస్టు కాలనీలో చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ రారాజు కథనం మేరకు.. పాత్రికేయురాలు చాన్ బేగం జర్నలిస్టు కాలనీలో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి జర్నలిస్టు కాలనీలోనే ఉన్న తన స్నేహితురాలు ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు చాన్‌బేగం ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. బుధవారం ఉదయం నిద్ర లేచి ఇంటికి వచ్చిన చాన్‌బేగం తాళాలు పగులగొట్టి ఉండటాన్ని చూసి చోరీ జరిగిందని గ్రహించింది. బీరువాను తెరిచి చూడగా అందులో ఉన్న నాలుగున్నర సవర్ల బంగారాన్ని అపహరించారని తెలుసుకుంది. ఆమె ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు రంగంలోకి దిగి ఘటనా స్థలంలో వివరాలు సేకరించారు. తిరుపతి నుంచి వచ్చిన క్లూస్ టీమ్ కూడా చోరీ జరిగిన ఇంట్లో వేలిముద్రలను సేకరించింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామనీ, దొంగలను త్వరలోనే పట్టుకుంటామని సీఐ రారాజు తెలిపారు.